సాక్షి కామారెడ్డి

శుక్రవారం, 10, అక్టోబర్, 2025



సర్వీస్ రోడ్లపై అంధకారం

భిక్కనూరు మండలం జంగంపల్లిలో నేషనల్ హైవేకి ఇరువైపులా సర్వీస్ రోడ్లపై అంధకారం అలుముకుంది.

- IIIలో ▸



నిధులిచ్చినా నిర్మించడం లేదు..

బిచ్కుందలోని బాలికల జెడ్పీహెచ్ఎస్‌లో మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు ప్రారంభం కావడం లేదు.

- IIIలో ▸

గరిష్టం/కనిష్టం
34.8 /21.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం వేళ ఎండ ఉంటుంది. అక్కడక్కడ మబ్బులు ఏర్పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు క్షేత్రస్థాయి విచారణ



బాన్సువాడ రూరల్: ఇందిరమ్మ ఇళ్లు పొందేందుకు అర్హులైనప్పటికీ.. అనర్హుల జాబితాలో పేరు వచ్చిన దరఖాస్తుదారులను సబ్ కలెక్టర్ కిరణ్మయి విచారించారు. మండలంలోని పలు గ్రామాల్లో గురువారం దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి వాస్తవ పరిస్థితిని పరిశీలించారు. గతంలో ఆర్‌సీసీ ఇళ్లలో అద్దెకు ఉన్నవారితోపాటు గతంలో ఫోర్‌వీలర్స్ ఉండి ప్రస్తుతం అమ్ముకున్న పలువురు దరఖాస్తుదారులు అనర్హులుగా మారారు. వారంతా ఇళ్లు కట్టుకునేందుకు ఆసక్తి చూపడంతో తుదివిచారణ చేసి ప్రభుత్వానికి జాబితాను పంపించనున్నారు. విచారణ నిమిత్తం మండలంలోని బోర్లం, బోర్లం క్యాంపు, జక్కల్‌దాని తండా, గట్టుమీది గ్రామాల్లో సబ్ కలెక్టర్ పర్యటించారు. ఆమె వెంట ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ స్పెషల్ బ్రాంచ్ కార్యవర్గం



కామారెడ్డి అర్బన్: జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ స్పెషల్ బ్రాంచ్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరాల వెంకట్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ఎం నాగరాజు, కేంద్ర సంఘం సభ్యులు, కే శివకుమార్ సమక్షంలో నామినేషన్లు స్వీకరించగా అన్ని పదవులకు ఒక్కో నామినేషన్ దాఖలైంది. దీంతో కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా సాయికృష్ణ, కార్యదర్శిగా నవిత, కోశాధికారిగా బి నరేందర్ ఎన్నికయ్యారు.

అటవీశాఖ జోనల్ క్రీడల్లో ప్రతిభ



కామారెడ్డి అర్బన్: కరీంనగర్‌లో ఈనెల 7, 8 తేదీల్లో నిర్వహించిన అటవీశాఖ రాజన్న జోనల్ స్థాయి క్రీడల్లో జిల్లా అటవీ విభాగం నుంచి డీఎఫ్‌వో బోగ నిఖిత క్యారమ్స్‌లో ప్రథమ స్థానం పొందారు. అలాగే కబడ్డీ మహిళ, పురుష విభాగం, వాలీబాల్ పురుష విభాగంలో, టగ్ ఆఫ్ వార్, షటిల్‌బ్యాట్, అథ్లెటిక్స్‌లో జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన వారిని డీఎఫ్‌వో నిఖిత అభినందించారు. జిల్లా అటవీ అధికారులు సునీత, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'సాగర్'లోకి 41 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



నిజాంసాగర్(జుక్కల్): ఉమ్మడి జిల్లా వరప్రదాయిని అయిన నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 41,680 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని అధికారులు గురువారం తెలిపారు. ఐదు గేట్లను ఎత్తి 41,680 క్యూసెక్కుల నీటిని మంజీరలోకి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం1405 అడుగులు(17.8టీఎంసీల) కాగా, 1405 అడుగుల(17.8టీఎంసీల) పూర్తిస్థాయి నీటిమట్టంతో ప్రాజెక్టు నిండుకుండలా ఉందని అధికారులు తెలిపారు.

నేడు సీఎం రాక



నిజామాబాద్ సిటీ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి తెలిపారు. సీఎం ఎమ్మెల్యే డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి తల్లి ద్వాదశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొననున్నారు. హైదరాబాద్ నుంచి ముఖ్యమంత్రి హెలికాప్టర్‌లో బయల్దేరి ఉదయం 11 గంటలకు జిల్లా కేంద్రానికి చేరుకుంటారు. కలెక్టరేట్ సమీకృత సముదాయం నుంచి కంఠేశ్వర్ బైపాస్‌లోని ఎమ్మెల్యే భూపతిరెడ్డి నివాసానికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంటకు బోర్గాం (పి) సమీపంలోని భూమారెడ్డి కన్వెన్షన్‌లో జరిగే ద్వాదశదిన కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం హైదరాబాద్ తిరిగి వెళతారు.



కామారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయం

సాగునీటి కష్టాలు తీరలేదు

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాలకు సాగునీరందించాల్సిన 22 వ ప్యాకేజీ పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. ఏళ్లు గడుస్తున్నా అవి కొలిక్కి రావడం లేదు. పూర్తిస్థాయిలో భూసేకరణ కూడా చేపట్టకపోవడంతో రైతుల సాగునీటి కష్టాలు ఇప్పట్లో తీరేట్లు కనిపించడం లేదు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా పర్యవేక్షణ చేసి, ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్లి వెంటపడితేగానీ అవి పూర్తికావని అంటున్నారు.

అభివృద్ధి అంతంతే..!

జిల్లా ఆవిర్భవించి రేపటికి తొమ్మిదేళ్లు

- పాలన చేరువైనా.. పరిష్కారం కాని సమస్యలు
- జిల్లా కేంద్రంలో మెరుగుపడని సౌకర్యాలు
- అసంపూర్తిగా ప్యాకేజీ 22 పనులు
- కనిపించని సౌత్‌క్యాంపస్ అభివృద్ధి

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : కామారెడ్డి జిల్లా ఏర్పాటై తొమ్మిదేళ్లయ్యింది. అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పాలనా సౌలభ్యం కోసం కొత్త జిల్లాలను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా కామారెడ్డి జిల్లాను 2016 అక్టోబర్ 11న ప్రారంభించింది. జిల్లా ఏర్పాటుతో పాలన ప్రజలకు చేరువైంది. జిల్లా ఏర్పాటుతో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు విషయంలో పర్యవేక్షణ పెరిగింది. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అమలు కావడానికి దోహదపడింది. ఉమ్మడి జిల్లాలో అధికార యంత్రాంగం అన్ని ప్రాంతాలకు వెళ్లడం ఇబ్బందిగా ఉండేది. ఒక్కో ప్రాంతానికి ఏడాదికోమారు కూడా వెళ్లే పరిస్థితులు ఉండేవి కాదు. కానీ జిల్లా ఏర్పాటైన తరువాత కలెక్టర్‌తోపాటు జిల్లా స్థాయి అధికారులు ప్రతిరోజూ ఏదో ఒక ప్రాంతంలో పర్యటిస్తూ పర్యవేక్షిస్తున్నారు. కామారెడ్డి జిల్లా ఆవిర్భవించిన మరుసటి ఏడాది జిల్లా కలెక్టరేట్‌తోపాటు జిల్లా పోలీసు కార్యాలయ భవనాల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. నాలుగేళ్లపాటు పనులు కొనసాగగా, 2021 జూన్ 20వ తేదీన అప్పటి సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభించారు. కాగా కామారెడ్డి జిల్లా ఏర్పాటై తొమ్మిదేళ్లవుతున్నా అభివృద్ధిలో మాత్రం ఇంకా వెనుకబడే ఉందనే చెప్పాలి. జిల్లాలో సాగునీటి సమస్యతోపాటు మరెన్నో సమస్యలు పరిష్కారం కాలేదు.



కామారెడ్డి కలెక్టరేట్

జిల్లా కేంద్రంలో..

కామారెడ్డి పట్టణం జిల్లా కేంద్రంగా మారిన తరువాత భూముల ధరలు పెరిగాయే తప్ప సౌకర్యాలు మాత్రం మెరుగుపడలేదు. ఇటీవల జిల్లా కేంద్రంలో భారీ వరదలతో జీఆర్ కాలనీ, కౌండిన్య కాలనీ, హౌజింగ్ బోర్డు, దేవీవిహార్ తదితర కాలనీలు వరదలతో అతలాకుతలమైన విషయం తెలిసిందే. నాలాలు కబ్జాల చెర వీడలేదు. చిన్న వర్షం కురిసినా రోడ్లు చెరవులను తలపిస్తున్నాయి. భారీ వర్షాలు కురిసిన సమయంలో పరిస్థితి ఘోరంగా తయారవుతోంది. జిల్లా కేంద్రంలో రోడ్ల విస్తరణ చేపట్టకపోవడంతో ట్రాఫిక్ కష్టాలు రెట్టింపయ్యాయి. స్టేషన్‌రోడ్డు, సిరిసిల్ల రోడ్డు, అడ్లూర్ రోడ్డు, అశోక్‌నగర్‌రోడ్డు, జన్మభూమి రోడ్లు విస్తరణకు నోచుకోలేదు. దశాబ్దాలుగా సమస్య పెండింగ్‌లోనే ఉన్నాయి. పట్టణాన్ని రెండుగా విభజించే రైల్వే లైన్‌పై ట్రాఫిక్ కష్టాలకు అంతులేదు. నిత్యం యాభైకి పైగా రైళ్లు, అలాగే గూడ్స్ రైళ్ల రాకపోకలతో గేట్ వేసినపుడల్లా వాహనాదరులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిజాంసాగర్ చౌరస్తా, సీఎస్ఐ చర్చి కూడలి, మున్సిపల్ కూడలి, ప్రభుత్వ ఆస్పత్రి, రామారెడ్డి రోడ్, ధర్మశాల కూడళ్ల వద్ద ట్రాఫిక్ సమస్యలు రెట్టింపయ్యాయి. జంక్షన్‌ల అభివృద్ధి జరగడం లేదు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. రైతులు రోడ్ల మీదే కూరగాయలు అమ్ముకుంటున్నారు. బస్ షెల్టర్ల నిర్మాణం లేక వానొచ్చినా, ఎండొచ్చినా పట్టణంలోని పాతబస్టాండ్, హైదరాబాద్ రోడ్డులోని గెస్ట్‌హౌజ్, నిజాంసాగర్ రోడ్డులో ప్రయాణికులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు.

విద్యారంగం..

జిల్లా కేంద్రంలో విద్యారంగ అభివృద్ధికి అవకాశాలున్నా ప్రభుత్వం దృష్టి సారించడం లేదు. గత ప్రభుత్వంలో ప్రభుత్వ వైద్య కళాశాల వచ్చింది. కళాశాల, హాస్టల్ భవనాల నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయి. అయితే ఇంజినీరింగ్, డీఎడ్, బీఎడ్, నర్సింగ్ కాలేజీలు ఒక్కటీ రాలేదు. సౌత్ క్యాంపస్ అభివృద్ధి ముందుకు కదలడం లేదు. జుక్కల్, ఎల్లారెడ్డిలకు ఇంటిగ్రేటెడ్ గురుకులాలు మంజూరైనా ఇప్పటికీ పనులు మొదలుకాలేదు. కామారెడ్డికి ఇప్పటికీ మంజూరు కాలేదు. జిల్లా అభివృద్ధిపై ప్రస్తుత ప్రభుత్వ పెద్దలు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

ఆశావహులకు నిరాశే..



బస్వాపూర్ ఎంపీటీసీ స్థానానికి నామినేషన్ దాఖలు చేస్తున్న స్వతంత్ర అభ్యర్థి కార్తీక్ రెడ్డి



తాడ్వాయిలో నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సంగ్వాన్

- ఉదయం నోటిఫికేషన్.. సాయంత్రం స్టే
- స్థానిక పోరు తాత్కాలికంగా వాయిదా

కామారెడ్డి క్రైం: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై హై కోర్టు స్టే విధించడంతో ఆశావహులకు నిరాశ ఎదురైంది. ఎన్నికల కమిషన్ జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసిన విషయం తెలిసిందే. గురువారం ఉదయం 10.30 గంటలకు రిటర్నింగ్ అధికారులు ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేశారు. సాయంత్రం 4 గంటలకు హై కోర్టు స్టే విధించినట్లు ప్రకటన వెలువడడంతో ప్రక్రియను అంతటితో నిలిపివేశారు. జిల్లాలోని అన్ని మండల పరిషత్ కార్యాలయాల్లో నామినేషన్లు స్వీకరించేందుకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. నామినేషన్ దాఖలు చేసేందుకు వచ్చిన వారికి నామినేషన్ పత్రాలను సైతం పంపిణీ చేశారు. ఎన్నికల్లో పోటీ చేయాలని ఆసక్తితో ఉన్న చాలా మంది దరఖాస్తు పత్రాలను తీసుకువెళ్లారు. హై కోర్టులో ఎన్నికలకు సంబంధించిన పిటిషన్లపై విచారణ సాగుతోందని తెలిసినా చాలా మంది స్టే వస్తుందని అనుకోలేదు. ఎన్నికలు యథావిధిగా కొనసాగుతాయనే నమ్మకంతో ఉన్న వారికి చివరికి నిరాశే ఎదురైంది.

ఎంపీటీసీ స్థానాలకు రెండు నామినేషన్లు

జిల్లాలో మొత్తం 25 జెడ్పీటీసీ, 233 ఎంపీటీసీ స్థానాలున్నాయి. మొదటి విడతలో 14 జెడ్పీటీసీ, 136 ఎంపీటీసీ స్థానాలకు నోటిఫికేషన్‌ను ఉదయం జారీ చేయగా.. కోర్టు స్టే వచ్చేలోపు రెండు ఎంపీటీసీ స్థానాలకు రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. భిక్కనూరు మండలం బస్వాపూర్ ఎంపీటీసీ స్థానానికి ఓ స్వతంత్ర అభ్యర్థి, గాంధారి మండలం సీతాయిపల్లి ఎంపీటీసీ స్థానానికి బీఆర్‌ఎస్ అభ్యర్థి నామినేషన్ వేశారు. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 11వ తేదీ వరకు నామినేషన్‌ల స్వీకరణ, 12న పరిశీలన, 15 వరకు ఉపసంహరణ, 23న పోలింగ్ నిర్వహించాల్సి ఉంది. హై కోర్టు స్టే విధించడంతో ఎన్నికల ప్రక్రియ మొత్తం వాయిదా పడింది. తదుపరి కార్యాచరణ ఎప్పుడు, ఏ విధంగా ఉంటుందో జిల్లావాసులు చర్చించుకుంటున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జైలు శిక్ష, జరిమానాలు

కామారెడ్డి క్రైం: మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 58 మందికి న్యాయస్థానాలు జైలు శిక్ష, జరిమానాలు విధించాయి. జిల్లాలోని ఆయా చోట్ల డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన వారిని పోలీసులు గురువారం జిల్లాలోని ఆయా కోర్టుల్లో హాజరుపరిచారు. దేవునిపల్లి పీఎస్ పరిధిలో నలుగురికి రెండు రోజులు, ఆరుగురికి ఒక రోజు జైలుశిక్ష విధించడంతోపాటు ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున జరిమానాను కోర్టు విధించింది. అలాగే కామారెడ్డి కోర్టు ఒకే రోజు ఆరుగురికి ఒక రోజు చొప్పున జైలు శిక్ష విధించింది. దోమకొండ పీఎస్ పరిధిలో ఒకరికి రెండు రోజుల జైలు, రూ.వెయ్యి జరిమానా, మాచారెడ్డి, భిక్కనూర్, కామారెడ్డి పీఎస్‌ల పరిధిలో ఒక్కొక్కరికి ఒకరోజు జైలు, రూ.వెయ్యి చొప్పున జరిమానా పడింది. కామారెడ్డి పీఎస్ పరిధిలో 14 మందికి, దేవునిపల్లి పరిధిలో 20 మందికి, దోమకొండ పీఎస్ పరిధిలో ఆరుగురికి, ఇతర పీఎస్‌ల పరిధిలో మరో నలుగురు వ్యక్తులకు రూ.వెయ్యి చొప్పున జిల్లాలోని ఆయా కోర్టులు జరిమానా విధించినట్లు ఎస్పీ రాజేశ్‌చంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపొద్దని సూచించారు.

జంక్షన్ విస్తరణ ఎన్నడో..



కామారెడ్డి పట్టణంలోని ఇందిరాచౌక్‌లో కొనసాగుతున్న పనులు

- పదేళ్ల క్రితమే ఇందిరాచౌక్ విస్తరణకు బల్దియా తీర్మానం
- విస్తరణ లేకుండానే పనులు చేపడుతున్న ఆర్అండ్‌బీ
- రెండు శాఖల మధ్య సమన్వయ లోపం

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ఇందిరాచౌక్ జంక్షన్‌లో అభివృద్ధి పనులను రెండు రోజుల క్రితం ప్రారంభించారు. జంక్షన్ విస్తరణ, అభివృద్ధి కోసం పదేళ్ల క్రితమే బల్దియాలో కౌన్సిల్ తీర్మానం చేసి అవసరమైన నిధులను మంజూరు చేసింది. ప్రస్తుతం ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో పనులను ప్రారంభించారు. పాతబస్టాండ్, రైల్వేషన్ ముందు నిత్యం ప్రజలతో రద్దీగా ఉండే ఇందిరా చౌక్‌లో జంక్షన్‌ను విస్తరించి అభివృద్ధి పనులు చేయాల్సి ఉంది. కానీ ఆర్అండ్‌బీ విస్తరణను విస్మరించి పనులు చేపడుతోంది. ఇందిరాగాంధీ విగ్రహాన్ని తొలగించారు. స్థలం విస్తరణ చేయకుండా పనులు సాగిస్తున్నారు. ఇందిరాగాంధీ విగ్రహం ఏర్పాటు చేసి వృత్తాకారంలో స్టీల్ రెయిలింగ్, పచ్చదనం ఏర్పాటు చేస్తున్నారు. అయితే పనులు చేపట్టడంలో బల్దియా, ఆర్అండ్‌బీ అధికారుల మధ్య సమన్వయం లోపించింది. మున్సిపల్ టౌన్‌ప్లానింగ్, ఇంజినీరింగ్ అధికారులకు పనులకు సంబంధించి సమాచారం కూడా లేకపోవడం గమనార్హం. ఇరుశాఖల సమన్వయంతో ఇందిరాచౌక్ జంక్షన్‌ను విస్తరణ చేసి లైటింగ్, వాటర్ ఫౌంటెయిన్, పచ్చదనంతో మరింత అభివృద్ధి చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారి హన్మంత్‌రావును వివరణ కోరగా.. బల్దియా ఆధ్వర్యంలో జంక్షన్ విస్తరణ చేయాలని గతంలోనే కౌన్సిల్ తీర్మానం చేసిందన్నారు. ప్రస్తుతం ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నాయని.. దీనికి సంబంధించి తమకు సమాచారం లేదన్నారు. తమకు సైతం సమాచారం లేదని టీపీవో గిరిధర్ తెలిపారు.

అందని ధాన్యం కమీషన్

- రెండేళ్ల నుంచి మహిళా సంఘాల ఎదురుచూపులు
- క్వింటాల్ ధాన్యం సేకరిస్తే రూ.32..
- మంజూరు అవ్వాల్సిన మొత్తం రూ.4 కోట్లు

బిచ్కుంద(జుక్కల్): ధాన్యం సేకరణకు సంబంధించిన కమీషన్ డబ్బుల కోసం మహిళా సంఘాలు ఎదురు చూస్తున్నాయి. కొనుగోలు కేంద్రాలు నిర్వహించిన మహిళా సంఘాలకు క్వింటాల్‌కు రూ.32 కమీషన్ ఇస్తామని ఇప్పటి వరకు ఇవ్వకపోవడంతో రూ.4 కోట్ల బకాయి పేరుకుపోయింది. 2023–24 అలాగే 2024–25 ఖరీఫ్, రబీ కమీషన్ ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. రెండేళ్ల నుంచి కమిషన్ డబ్బులు ఇవ్వకపోవడంతో స్వయం సహాయక సంఘాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. మొత్తం కమిషన్ రూ.4,36,43,607 కోట్లు ఫుడ్ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. కమీషన్ కోసం మహిళా సంఘాల సభ్యులు స్థానిక అధికారులను అడిగితే తమ చేతుల్లో ఏమీ లేదని, వచ్చినప్పుడు ఇస్తామని చెబుతున్నారు. ఈ సీజన్‌కు సంబంధించి ధాన్యం సేకరణ కోసం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని, ఇప్పటికైనా గతంలో సేకరించిన ధాన్యానికి సంబంధించిన కమీషన్ డబ్బులు చెల్లించాలని మహిళా సంఘాలు కోరుతున్నాయి.



దేవాడలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మహిళా సంఘం సభ్యులు

కమీషన్ చెల్లించాలి



రెండేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న కమీషన్ డబ్బులను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. వచ్చిన కమిషన్‌తో సంఘాన్ని అభివృద్ధి చేసుకొని ఆర్థికంగా బలోపేతమవుతాం. డబ్బులు లేకపోవడంతో సంఘం అభివృద్ధి జరగడం లేదు. జిల్లా అధికారులు స్పందించి కమిషన్ చెల్లించాలి. – గీత, గ్రామ మహిళా సంఘం అధ్యక్షురాలు, వాజిద్‌నగర్

ఏటీసీల్లో మిషనరీలను బిగించాలి

ఎల్లారెడ్డి/బిచ్కుంద: అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)లలో అన్ని యంత్రాలను ఏర్పాటు చేసి విద్యార్థులకు బోధిస్తూ శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. ఎల్లారెడ్డి, బిచ్కుందలోని ఏటీసీలను గురువారం ఆయన పరిశీలించారు. విద్యార్థుల అడ్మిషన్లు, తరగతుల నిర్వహణ వివరాలు తెలుసుకున్నారు. బిచ్కుంద ఏటీసీలో మిషనరీని పూర్తిస్థాయిలో బిగించకపోవడం, విద్యుత్ సరఫరా లేకపోవడం, విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడం, ట్రైనర్లు నలుగురు మాత్రమే ఉండడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. మిషనరీని పూర్తిస్థాయిలో బిగించి విద్యార్థులకు శిక్షణ తరగతులను ప్రారంభించాలని ప్రిన్సిపాల్ ప్రమోద్‌కుమార్‌ను ఆదేశించారు. ఏటీసీల పర్యవేక్షణ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. కలెక్టర్ వెంట బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, తహసీల్దార్లు వేణుగోపాల్, ప్రేమ్‌కుమార్, ఎంపీడీవో గోపాల్, బిచ్కుంద ఏటీసీ ప్రిన్సిపాల్ ప్రమోద్‌కుమార్ ఉన్నారు.



బిచ్కుంద ఏటీసీలో బాధ్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ సంగ్వాన్, పక్కన సబ్ కలెక్టర్ కిరణ్మయి

వరికి ఎండాకు తెగులు

- ఆందోళనలో అన్నదాతలు
- వాతావరణంలో మార్పులే కారణమా..?
- పొట్టదశలో పంట.. రైతుల్లో భయం

దోమకొండ: వాతావరణంలో వస్తున్న మార్పులతో వరి పంటకు ఎండాకు తెగులు సోకుతోంది. ప్రస్తుతం పంట పొట్ట దశలో ఉండగా.. ఆకు చివరి కొనలు ఎండిపోయి కింది వరకు విస్తరిస్తోంది. జిల్లా వ్యాప్తంగా 3.18 లక్షల ఎకరాల్లో వరిని సాగు కాగా, 4.50 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. అయితే జిల్లాలోని దోమకొండతోపాటు కామారెడ్డి, భిక్కనూరు, బీబీపేట, మాచారెడ్డి, రాజంపేట, బాన్సువాడ, లింగంపేట తదితర మండలాల్లో వరి పంటపై ఎండాకు తెగులు తీవ్ర ప్రభావం చూపుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధిక వర్షాలు, వరదలతో సతమతమవుతున్న తమను ఇప్పుడు ఎండాకు తెగులు ఆందోళనకు గురి చేస్తోందంటున్నారు. అధిక వర్షాలు, వరదలు, వాతావరణంలో ఏర్పడుతున్న మార్పులు ఎండాకు తెగులు సోకడానికి కారణమని రైతులు పేర్కొంటున్నారు. గాలి ద్వారా బ్యాక్టీరియా వ్యాప్తి చెందుతుండగా.. తెగులు కారణంగా పొలాలు ఎండిపోయినట్లు కనబడుతున్నాయి.

తెగులను గుర్తించడం ఇలా..

ఆకులపై పసుపు రంగు నీటి మచ్చలు ఏర్పడి అంచులు ఊడిపోతుంటాయి. ఓ గాజు గ్లాసులో నీరు నింపి ఎండిన ఆకుల చివరి భాగం చిన్నగా కోసి నీళ్లలో వేయాలి. నీరు పసుపు రంగులోకి మారితే పంట తెగులుబారిన పడినట్లు అనుమానించొచ్చు.

తెగులు నివారణకు..

నత్రజని, కాంప్లెక్స్ ఎరువుల వాడకం తగ్గించాలి. సీవోసీ 100 గ్రాములు/ ప్లాంటో మైసిన్ 400 గ్రాములు ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. స్ట్రెపితోమైసిన్/ప్లాంటో మైసిన్/అగ్రిమైసిన్ 100 లేదా 200 గ్రాములు ఎకరానికి వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసి తెగులును నివారించవచ్చు. పొలానికి రోజు విడిచి రోజు తడులు అందిస్తూ ఉండాలని వ్యవసాయశాఖ అధికారులు రైతులకు సూచనలు చేస్తున్నారు.



దోమకొండలో ఎండాకు తెగులు సోకిన వరి

ఎండాకు తెగులు సోకింది



దోమకొండ గ్రామ శివారులోని సబ్ స్టేషన్ వద్ద మాకు వ్యవసాయ భూమి ఉంది. మేము సాగు చేసిన వరి ఆకులపై గత రెండు రోజులుగా పసుపురంగు మరకలు వస్తున్నాయి. ఇది ఎండాకు తెగులు అని తెలిసింది. దీంతో పొట్ట దశలో ఉన్న పంట దెబ్బతినే అవకాశం ఉంది. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సలహాలు, సూచనలు చేసి తెగులు నివారణ చర్యలు చేపట్టాలి. – ఎస్ మల్లేశం, రైతు, దోమకొండ

మద్యం దుకాణాలకు 71 దరఖాస్తులు

కామారెడ్డి రూరల్: జిల్లాలోని మద్యం దుకాణాలకు గురువారం నాటికి 71 దరఖాస్తులు అందినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ హనుమంతరావు తెలిపారు. కామారెడ్డి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 15 దుకాణాలకు 18 దరఖాస్తులు, ఎల్లారెడ్డి స్టేషన్ పరిధిలో 7 దుకాణాలకు 4, బాన్సువాడ స్టేషన్ పరిధిలో 9 దుకాణాలకు 16, దోమకొండ స్టేషన్ పరిధిలో 8 దుకాణాలకు 10, బిచ్కుంద స్టేషన్ పరిధిలో 10 దుకాణాలకు 23 దరఖాస్తులు అందాయన్నారు. రెండో శనివారం సైతం యథావిధిగా దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. ఒక్కొక్కరు ఎన్నైనా, ఎక్కడైనా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి పడేలా ఎవరైనా ప్రయత్నిస్తూ సిండికేట్‌గా మారితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ టీము నిఘా సారించిందని తెలిపారు.

క్లుప్తంగా

విద్యుత్ తీగలు తగిలి చెరుకు పంట దగ్ధం



మద్నూర్(జుక్కల్): విద్యుత్ తీగలు తగలడంతో మండలంలోని దన్నూర్ శివారులో సాగువుతున్న చెరుకు పంట దగ్ధమైనట్లు బాధితుడు దేవ్‌కత్తే మారుతి తెలిపారు. గురువారం ప్రమాదవశాత్తు చెరుకు పంటకు విద్యుత్ తీగలు తగలడంతో మంటలు వ్యాపించాయని పేర్కొన్నారు. మద్నూర్ ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో ఫైర్ సిబ్బంది రంగంలోకి దిగి మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో రూ.1.50 లక్షల పంట నష్టం జరిగిందని, సకాలంలో ఫైరింజన్ రావడంతో పక్కనే ఉన్న రూ.2.50 లక్షల విలువజేసే పంటను కాపాడినట్లు అగ్నిమాపక అధికారి మాధవ్ తెలిపారు. సిబ్బంది హరీశ్, సంతోష్, సహదేవ్ ఉన్నారు.

ఎండలోనే మందులు పిచికారీ చేయాలి



బాన్సువాడ రూరల్: రైతులు ఎండ సమయంలోనే పురుగుల మందులను పిచికారి చేయాలని, దీంతో ఎంతో ఉపయోగం ఉంటుందని కోనాపూర్ క్లస్టర్ ఏఈవో జ్ఞానేశ్వర్ అన్నారు. హన్మాజీపేట్ గ్రామ శివారులోని వరిపంటలను గురువారం ఆయన పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల కారణంగా వరిలో మెడవిరుపు తెగులు ఉధృతి ఉందన్నారు. నివారణకు పికాక్సీ స్ట్రోబిన్ 7.05శాతంతో పాటు ప్రొపికోనజోల్ 11.71శాతం పిచికారీ చేయాలన్నారు. లేదంటే అజాక్స్ ట్రోబిన్ 11శాతంతో పాటు టెబుకోనజోల్ 18.3శాతం వినియోగించాలన్నారు. ఐసోప్రోతయోలిన్ మందులను ఎండ సమయంలో స్ప్రే చేసుకోవాలన్నారు. రైతులు బండారు సుభాష్, ఇస్తరిగారి కిష్టాన్న, సాయిరాం, గంగాధర్ ఉన్నారు.

11న దివ్యాంగ క్రికెట్ ట్రైలర్స్ ఎంపికలు



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో ఇందిరాగాంధీ స్టేడియంలో ఈనెల 11న తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఫర్ డిసేబుల్ ఆధ్వర్యంలో దివ్యాంగుల క్రికెట్ ట్రైలర్స్ ఎంపికలు నిర్వహించనున్నట్లు క్రికెట్ కోచ్ రియాజ్ తెలిపారు. ఇందిరాగాంధీ స్టేడియంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సెలక్షన్‌లో ప్రతిభ చూపిన దివ్యాంగుల క్రికెటర్లను రాష్ట్ర, జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని దివ్యాంగ క్రికెటర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9951465479, 7013802034 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఇంటిగ్రేటెడ్ పీజీ పరీక్షల ఫీజు చెల్లించాలి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని పీజీ ఇంటిగ్రేటెడ్ కోర్సులు (అప్లయిడ్ ఎకనామిక్స్, ఇంటిగ్రేటెడ్ ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ) 7, 9వ సెమిస్టర్ థియరీ, ప్రాక్టికల్ పరీక్షల ఫీజును ఈ నెల 23 వరకు చెల్లించాలని కంట్రోలర్, ప్రొఫెసర్ సంపత్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.100 అపరాధ రుసుముతో ఈనెల 25 వరకు ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. ఏపీ ఈ అన్ని సబ్జెక్టులకు కలిపి రూ.500లు, ఐపీసీ హెచ్ అన్ని సబ్జెక్టులకు కలిపి రూ.600 లు పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

'స్థానిక' నామినేషన్ల స్వీకరణ



రాజంపేటలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ నామినేషన్ల స్వీకరణకు సిద్ధంగా ఉన్న అధికారులు




బీబీపేటలో..



తాడ్వాయిలో..

- మండల కేంద్రాల్లో ప్రత్యేక కార్యాలయాల ఏర్పాటు
- తాడ్వాయిలోని కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

భిక్కనూరు/బీబీపేట/రాజంపేట/ఎల్లారెడ్డి/తాడ్వాయి/గాంధారి: రాష్ట్ర ప్రభుత్వం ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు ఇటీవల గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో గురువారం నామినేషన్ల స్వీకరణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈసందర్భంగా జిల్లాలోని ఆయా మండల కేంద్రాల్లో అధికారులు నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను ఏర్పాటు చేసి, సిబ్బందిని సిద్ధం చేశారు. కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. భిక్కనూరు మండలంలోని బస్వాపూర్ ఎంపీటీసీ స్థానానికి కార్తీక్‌రెడ్డి ఇండిపెండెంట్‌గా భిక్కనూరు మండల పరిషత్ కార్యాలయంలో నామినేషన్‌ను దాఖలు చేశారు. మండలంలో ఎంపీటీసీ స్థానానికి ఒక్క నామినేషన్ మాత్రమే దాఖలు అయిందని అధికారులు వివరించారు. అలాగే గాంధారి మండల పరిధిలోని సీతాయిపల్లి ఎంపీటీసీ స్థానానికి గ్రామానికి చెందిన సింగసాని పండరి నామినేషన్ దాఖలు చేశారని అధికారులు తెలిపారు. బీబీపేట, రాజంపేట, తాడ్వాయి మండలాల్లో ఎవరూ నామినేషన్లు అందించలేదు. తాడ్వాయి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తనిఖీ చేశారు. ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. అంతకుముందు ఏటీసీ సెంటర్‌ను తనిఖీ చేశారు. కామారెడ్డి–ఎల్లారెడ్డి ప్రధాన రహదారి నుంచి ఏటీసీ సెంటర్‌కు వెళ్లే రోడ్డు సరిగా లేకపోవడంతో మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించాలని తహసీల్దార్ శ్వేతను ఆదేశించారు. ఇదిలా ఉండగా సాయంత్రం స్థానిక ఎన్నికలపై హైకోర్టు స్టే విధించిన విషయం విదితమే. దీనిపై ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.



ఎల్లారెడ్డిలో ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేస్తున్న అధికారులు



తాడ్వాయిలో నామినేషన్ స్వీకరణ కేంద్రం సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



భిక్కనూరులోని నామినేషన్ కేంద్రం వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

ఎస్‌జీఎఫ్ గేమ్స్ సెలక్షన్స్

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం జోనల్ లేవల్ క్రీడల సెలక్షన్స్ నిర్వహించినట్లు మండల విద్యాధికారి శౌకత్‌అలీ తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని ఉన్నత పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలలకు చెందిన అండర్–14, అండర్–17 విభాగంలో వాలీబాల్, కబడ్డీ క్రీడాపోటీలు నిర్వహించారు. ఆయా పాఠశాలల నుంచి 14 బాలుర, 14 బాలికల జట్లు పాల్గొన్నాయన్నారు. మండల స్థాయిలో సెలక్షన్ అయిన వారు శుక్రవారం తాడ్వాయి మండల కేంద్రంలో నిర్వహించే జోనల్ స్థాయి పోటీల్లో తలపడనున్నట్లు తెలిపారు. జోనల్ స్థాయిలో సెలక్షన్ అయిన వారు కామారెడ్డిలో సోమవారం నిర్వహించే జిల్లా స్థాయిలో పాల్గొంటారని తెలిపారు. మండల క్రీడల కన్వీనర్ రాజగౌడ్, పీఈటీలు సంతోష్, సంగమేశ్వర్, బన్సిలాల్ పాల్గొన్నారు.



లింగంపేట బాలుర ఉన్నత పాఠశాలలో వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

గుంతల రోడ్డుకు మరమ్మతులు



సాక్షి ఎఫెక్ట్..

దోమకొండ: మండల కేంద్రంలోని బస్టాండ్ ఎదురుగా ఉన్న పెద్దమ్మ కాలనీకి వెళ్లే రోడ్డుపై గుంతలు ఏర్పడగా, అధికారులు మరమ్మతులు చేపట్టారు. రోడ్డు దుస్థితిపై 'రోడ్డు ఇలా.. ప్రయాణం ఎలా..!' అనే శీర్షికన సాక్షి దినపత్రికలో ఈనెల 8న కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి అధికారులు స్పందించారు. ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి యాదగిరి, సిబ్బందితో కలిసి గురువారం గుంతల వద్ద మొరం పోసి, ట్రాక్టర్‌తో రోడ్డును బాగుచేయించారు. కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు.

13న జిల్లాస్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలు

నిజామాబాద్‌నాగారం: ఎస్‌జీఎఫ్ అండర్–14 బాలబాలికల విభాగంలో కబడ్డీ, వాలీబాల్ జిల్లా స్థాయి పోటీలు ఈ నెల 13న నిర్వహించనున్నట్లు క్రీడల కార్యదర్శి నాగమణి గురువారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు పాత కలెక్టరేట్ మైదానంలో పోటీలు ఉంటాయన్నారు. ప్రతిభ చూపిన వారిని ఈ నెల 16న సంగారెడ్డిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. వివరాలకు 9347216426 నెంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

వ్యాపారులు ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలి

బిచ్కుంద(జుక్కల్): మున్సిపాలిటీ పరిధిలో వ్యాపారం చేస్తున్న దుకాణదారులు, వ్యాపారులు తప్పకుండా వృత్తి వ్యాపార లైసెన్సు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శేక్ హయ్యుం అన్నారు. పట్టణంలోని వ్యాపారులకు గురువారం ఆయన కొత్తగా లైసెన్సులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బిచ్కుంద గ్రామం నుంచి కొత్తగా మున్సిపాలిటీగా ఏర్పడిందని, గ్రామ పంచాయతి పేరుతో ఉన్న లైసెన్సు చెల్లదన్నారు. గ్రామ పంచాయతి, మున్సిపాలిటీ నిబంధనలు వేర్వేరుగా ఉంటాయని, కావును వ్యాపారులు లైసెన్సును రెన్యూవల్ చేసుకోవాలన్నారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సానిటరి ఇన్‌స్పెక్టర్ విశాల్ తదితరులు పాల్గొన్నారు.



వ్యాపారులకు లైసెన్స్ అందిస్తున్న అధికారులు

క్రైం కార్నర్

పేకాడుతున్న ఆరుగురి అరెస్టు

బాన్సువాడ: పట్టణంలోని సంగమేశ్వర కాలనీలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు సీఐ అశోక్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు జగన్నాథం సతీశ్ ఇంటిపై దాడి చేసి పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకొని కేసు నమోదు చేశామన్నారు. రూ.24,500 నగదు, సెల్‌ఫోన్లు, మూడు బైక్‌లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో గురువారం డ్రంకెన్‌డ్రైవ్ చేపట్టినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ తెలిపారు. జిల్లా కేంద్రానికి చెందిన మహమూద్ ఖాన్ మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. కోర్టులో హాజరుపర్చగా సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ గంగాధర్ ఏడు రోజుల జైలు శిక్ష విధించారు.

చెరువులో పడి మహిళ మృతి



గాంధారి (ఎల్లారెడ్డి): మండల పరిధిలోని పెద్ద పోతంగల్ గ్రామ సమీపంలోని గిద్ద చెరువులో గురువారం ప్రమాదవశాత్తు పడి దుర్కి సాయవ్వ (40) మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. సాయవ్వ భర్త ప్రసాద్‌కు ఇద్దరు భార్యలు. ఆయన మొదటి భార్యతో కలిసి నిజాంసాగర్‌లో ఉంటున్నాడు. సాయవ్వ ఇటీవల కూతురుకు పెళ్లి చేసి పెద్దపోతంగల్‌లో ఒంటరిగా నివసిస్తోంది. గురువారం ఉదయం బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందింది. మృతురాలి కూతురు సౌందర్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దోమకొండలో ఇద్దరు అదృశ్యం



నర్సింలు(ఫైల్)



చిట్యాల నవీన్ (ఫైల్)

దోమకొండ: మండల కేంద్రానికి చెందిన ఇద్దరు అదృశ్యమైనట్లు ఎస్సై స్రవంతి తెలిపారు. దోమకొండకు చెందిన మాసుల నర్సింలు గురువారం మధ్యాహ్నం గేదెలను మేపడానికి వెళ్తు న్న అని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లాడు. రాత్రి తిరిగి ఇంటికి రాలేదు. ఆచూకీ లభించక పోవడంతో నర్సింలు భార్య లావణ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇదే మండల కేంద్రానికి చెందిన చిట్యాల నవీన్ అనే వ్యక్తి గురువారం ఉదయం కుటుంబంలో గొడవల కారణంగా ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయాడు. రాత్రయినా తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. ఈమేరకు అతడి భార్య రాధిక పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

టేకు చెట్ల చోరీలో ఇద్దరి అరెస్టు



నిందితుల అరెస్టును చూపుతున్న పోలీసులు

మాక్లూర్: వ్యవసాయ క్షేత్రం నుంచి టేకు చెట్లను కోసి అపహరించుకుపోయిన దొంగలను మాక్లూర్ పోలీసులు గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై రాజశేఖర్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఆగస్టు 19న మండలంలోని మెట్‌పల్లి–వల్లభాపూర్ గ్రామాల మధ్యలో ఉన్న గోపాల్ శ్రీధర్ వ్యవసాయ క్షేత్రం నుంచి దొంగలు 20 టేకు చెట్లను మిషన్‌తో కోసి దుంగలను ఎత్తుకెళ్లారు. యజమాని శ్రీధర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, నార్త్ జోన్ సీఐ శ్రీనివాస్, ఎస్సై రాజశేఖర్ దర్యాప్తు చేపట్టారు. చెట్లను అపహరించిన జావేద్, మహమ్మద్ అబ్బాస్‌లను అరెస్టు చేసి వారి నుంచి రూ.95 వేల విలువజేసే టేకు కలపను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

రేషన్ డీలర్‌పై కేసు నమోదు



గండివేట్‌లో రేషన్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

గాంధారి(ఎల్లారెడ్డి): మండలంలోని గండివేట్ గ్రామంలో రేషన్ బియ్యం పంపిణీలో అవకతవకలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. దీంతో సంబంధిత రేషన్‌డీలర్‌పై గురువారం 6ఏ కేసు నమోదు చేసినట్లు ఆర్ఐ ప్రదీప్ తెలిపారు. కొన్ని రోజులుగా రేషన్ డీలర్ గంగ వేధిత వినియోగదారులకు బియ్యం పంపిణీ చేయలేదని తెలిపారు. గురువారం పౌరసరఫరాల డీటీ సురేశ్ దుకాణాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించగా 150 క్వింటాళ్ల సన్నబియ్యం, 66 క్వింటాళ్ల దొడ్డురకం బియ్యం తేడా వచ్చిందన్నారు. దీంతో డీలర్‌పై కేసు నమోదు చేసి మరో డీలర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చినట్లు తెలిపారు.

భూ కబ్జాలో ఏడుగురిపై..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని కన్నాపూర్ శివారులో అటవీ భూమిని కబ్జా చేసుకోవడానికి ప్రయత్నించిన ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై దీపక్‌కుమార్ తెలిపారు. అటవీ ప్రాంతంలో ఈ నెల 5న చెట్లను నరికివేసి, విధులకు ఆటంకం కలిగించిన ఎల్లేశం, భూమయ్య, వెంకటి, కవిత, సంతోష్, ధరత, సుజాతలపై అటవీ శాఖ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మోసగించిన గల్ఫ్ ఏజెంట్‌పై..

మోపాల్: మండలంలోని బాడ్సి గ్రామానికి చెందిన బోధకుంట పోశెట్టిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జడ్ సుస్మిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోశెట్టి ఐదు నెలల క్రితం బోధన్‌లోని రాకాసీపేట్‌కు చెందిన ప్యాట విజయ్‌కుమార్‌ను మలేసియాకు పంపించాడు. కంపెనీ వీసా ఉందని అబద్ధాలు చెప్పి డబ్బులు తీసుకున్నాడు. తీరా అక్కడికి వెళ్లిన తర్వాత కంపెనీ వీసా కాదని, విజిట్ వీసా ఇచ్చి పంపినట్లుగా విజయ్‌కుమార్ గ్రహించాడు. ఏజెంట్ పోశెట్టి విజిట్ వీసా ఇచ్చి మోసం చేశాడని విజయ్‌కుమార్ భార్య ఫిర్యాదు చేసింది. దీంతో పోశెట్టిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుస్మిత తెలిపారు.

పత్తి పంటకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి





మేనూర్ శివారులో పత్తి పంటను పరిశీలిస్తున్న అధికారులు.. మద్నూర్ శివారులో సోయా పంట..

మద్నూర్(జుక్కల్): పత్తి పంటకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని ఏరువాక శాస్త్రవేత్తలు, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రెడ్డి సూచించారు. మండలంలోని మేనూర్, మద్నూర్, డోంగ్లీ మండలంలోని మొగా గ్రామాల శివారులోని పత్తి, సోయా పంటను గురువారం జిల్లా వ్యవసాయ అధికారి, ఏరువాక శాస్త్రవేత్తలు పరిశీలించారు. పొలం బడి శిక్షణ కార్యక్రమంలో భాగంగా పంటలను పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశామని వారు తెలిపారు. పత్తి పంట బాగుందని తెగుళ్ల నుంచి పంటను కాపాడుకోవాలని వారు అన్నారు. అలాగే నిత్యం పత్తి పంటను పరిశీలిస్తు వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకోవాలన్నారు. రైతులు వేసిన సోయాబీన్ కొత్త రకం బాగుందని పంట కోత తర్వాత వచ్చే ఏడాది పంట వేయడం కోసం కొన్ని విత్తనాలను ఉంచుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏరువాక శాస్త్రవేత్తలు అనిల్‌రెడ్డి, రేవంత్, ఏవో రాజు, ఏఈవోలు అనిల్, విశాల్, సౌమ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బేడ బుడగజంగల వివరాల సేకరణ

మాచారెడ్డి: మండలంలోని చుక్కాపూర్ గ్రామాన్ని గురువారం జిల్లా స్థాయి అధికారుల బృందం సందర్శించింది. అడిషనల్ కలెక్టర్ విక్టర్ ఆధ్వర్యంలో అధికారుల బృందం గ్రామంలోని బేడ బుడగ జంగల స్థితి గతులు ఆచార వ్యవహారాల గురించి వివరాలు సేకరించారు. ఈసందర్భంగా బేడ బుడగ జంగల కులస్తులు తమ సమస్యల గురించి ఏకరువు పెట్టారు. తమకు గత కొన్నేళ్లుగా కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడం లేదన్నారు. దీనివల్ల తమ పిల్లల భవిష్యత్ అంధకారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అడిషనల్ కలెక్టర్ విక్టర్ మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారం కోసం గ్రామానికి వచ్చామన్నారు. ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ రవితేజ, గిరిజన సంక్షేమశాఖ జిల్లా అధికారి సతీష్ యాదవ్, మాచారెడ్డి తహసీల్దార్ సరళ, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖ అధికారులతోబాటు బేడ బుడగ జంగల నాయకులు సాయిలు, వేణు, పరుశరాం, లక్ష్మీపతి,రవి,పోచయ్య,వెంకటి పాల్గొన్నారు.



చుక్కాపూర్‌లో బేడ బుడగజంగల వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

26 నుంచి తీర్థయాత్రలకు ప్రత్యేక రైళ్లు

- జనవరి వరకు దేశీయ ఎయిర్ ప్యాకేజీ
- ఐఆర్‌సీటీసీ టూరిజం అసిస్టెంట్ మేనేజర్ పీవీ వెంకటేశ్ వెల్లడి



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న పీవీ వెంకటేశ్

నిజామాబాద్‌నాగారం: తీర్థయాత్రలకు వెళ్లే వారి కోసం రైల్వేశాఖ ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తీసుకొచ్చిందని ఐఆర్‌సీటీసీ టూరిజం అసిస్టెంట్ మేనేజర్ పీవీ వెంకటేశ్ తెలిపారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మాట్లాడారు. ఈ నెల 26 నుంచి నవంబర్ 4వ తేదీ వరకు ప్రత్యేక రైళ్లు, అక్టోబర్ నుంచి జనవరి వరకు దేశీయ ఎయిర్ ప్యాకేజీలను హైదరాబాద్ నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. భవ్య గుజరాత్ తీర్థయాత్రలో భాగంగా ద్వారకాదీష్ మందిరం, నాగేశ్వర జ్యోతిర్లింగ మందిరం, బేట్ ద్వారక, సోమనాథ్ జ్యోతిర్లింగ మందిరం, సబర్మతి ఆశ్రమం, సూర్యదేవాలయం, రాణికివావ్, స్టాచ్యూ ఆఫ్ యూనిటీ ప్రాంతాలను సందర్శన ఉంటుందని పేర్కొన్నారు. ఒక్కొక్కరికి సాధారణ టికెట్ ధర రూ.18,400(స్లీపర్), రూ. 30,200 (3 ఏసీ), రూ. 39,900 (2ఏసీ) అని తెలిపారు. రైలు, బస్సు, హోటల్, భోజన సదుపాయం కల్పిస్తామని వివరించారు. దేశీయ ఎయిర్ ప్యాకేజీలో భాగంగా అండమాన్, కశ్మీర్, కర్ణాటక, రాజస్థాన్, ఒడిశా, తమిళనాడులోని పలు ప్రాంతాల్లో ఆరు లేదా ఏడు రోజుల యాత్ర ఉంటుందని పేర్కొన్నారు. ప్రాంతాల మేరకు రూ.34,950 నుంచి రూ.56,625 వరకు చార్జీలు ఉంటాయన్నారు. అంతర్జాతీయ ఎయిర్ ప్యాకేజీలో భాగంగా థాయ్‌లాండ్, శ్రీలంక, దుబాయ్ దేశాల సందర్శన ఉంటుందని, అందులో భాగంగా ఒక్కొక్కరికి రూ.64,500 నుంచి రూ.1,12,250 వరకు చార్జీలు ఉంటాయని తెలిపారు. వివరాలకు 9701360701, 9281030711 నెంబర్లను సంప్రదించాలన్నారు. సమావేశంలో టూరిజం మానిటర్లు నరేశ్‌బాబు ఓర్సు, కొక్కుల ప్రశాంత్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు పెరిగేలా చూడాలి



మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్

డిచ్‌పల్లి: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవం చేయించుకునేలా గర్భిణులను ప్రోత్సహించాలని జిల్లా మలేరియా అధికారి తుకారాం రాథోడ్ సూచించారు. సాధారణ ప్రసవంతో కలిగే లాభాలు, శస్త్ర చికిత్సతో కలిగే నష్టాలను గర్భిణులకు వివరించాలన్నారు. డిచ్‌పల్లి సామాజిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఆశా కార్యకర్తల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. కీటక జనీత వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి తొలగించాలన్నారు. జ్వరానికి సంబంధించి రక్త పరీక్షలు చేయాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆశా కార్యకర్తలు కచ్చితంగా గర్భిణులతో ఫోలిక్ యాసిడ్(ఐరన్) మాత్రలు తినిపించాలని ఆదేశించారు. సమావేశంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి షారోన్ షైని క్రిస్టినా, వైద్యులు రాజశ్రీ, మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్, ఆరోగ్య పర్యవేక్షకులు అక్బర్ అలీ, దేవపాలం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు

చోరీ కేసులో ఇద్దరికి ఏడు నెలల జైలు

కామారెడ్డి క్రైం: తాడ్వాయి మండలం సంగోజీవాడి గ్రామంలో ఓ ఇంట్లో దొంగతనానికి పాల్పడిన ఇద్దరు నిందితులకు కామారెడ్డి కోర్టు ఏడు నెలల జైలు శిక్ష విధించింది. గత ఫిబ్రవరి 20న గ్రామానికి చెందిన గడ్డం రాజవ్వ ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లింది. మరుసటి రోజు చూసేసరికి తాళం పగులగొట్టి ఉంది. దొంగలు పడినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అదే గ్రామానికి చెందిన రాజశేఖర్ ఇంట్లో సైతం చోరీ జరిగిందని పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసులు అన్ని కోణాల్లో విచారణ జరిపి నిందితులను అదే గ్రామానికి చెందిన దోమకొండ అనిల్, గడ్డం బాల్‌రాజులుగా గుర్తించారు. వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. అప్పటి నుంచి కేసు కోర్టు పరిశీలనలో ఉంది. నేరం రుజువు కావడంతో కామారెడ్డి అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ బట్టు దీక్ష నిందితులకు 7 నెలల జైలు శిక్ష, రూ.200 చొప్పున జరిమానా విధిస్తూ గురువారం తీర్పు వెలువరించారు. నిందితులకు శిక్షపడేలా కృషి చేసిన ఏపీపీ రజిని, కేసును సక్రమ పద్ధతిలో విచారణ చేపట్టిన ఎస్సైలు వెంకటేశ్వర్లు, మురళీ, లైజనింగ్ అధికారి రామేశ్వర్‌రెడ్డి, సతీశ్‌గౌడ్‌ను ఎస్పీ అభినందించారు.

సాక్షి
ఫ్యామిలీ
నిజామాబాద్
శుక్రవారం ॥ 10-10-2025


కుమార్తె నితారాతో అక్షయ్ కుమార్

సైబర్ వలయం

ముందే పాఠం నేర్చుకుందాం

ఇప్పుడు ప్రపంచం వైఫైలో బందీ!
ఆ వైఫైయే సెల్‌ఫోన్‌కు ఆహారం..
ఆ సెల్‌ఫోనే అందరికీ ప్రాణాధారం!
రియల్ లైఫ్ కన్నా వర్చువల్ వరల్డ్‌లోనే శ్వాసిస్తున్నాం!
పిల్లలకైతే చెప్పక్కరలేదు..
చదువు - సంధ్య, ఆట - పాట అంతా డిజిటల్ డివైజే!
అందుకే ఆన్‌లైన్‌లో అవతలివైపు వాళ్లకు
అవలీలగా దొరికిపోతున్నారు..
ఆటవస్తువులుగా మారుతున్నారు!
ఈ ప్రమాదానికి సెలబ్రిటీల పిల్లలూ వల్నరబులే..
ప్రైవసీ కంచె వాళ్లను కాపాడలేకుంది!
తాజా ఉదాహరణ.. బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్
కూతురు నితారా కుమార్‌కు ఎదురైన అనుభవమే!

అక్షయ్ కుమార్ కూతురు నితారాకు పద మూడేళ్లు. అందరి పిల్లల్లాగే ఆ అమ్మాయికీ ఆన్‌లైన్ గేమ్స్ అంటే మహా ఇష్టం. అమ్మ ట్వింకిల్ ఖన్నా అనుమతితో రోజులో కొంచెంసేపు ఆన్‌లైన్ గేమ్స్‌తో ఎంటర్‌టైన్ అవుతూంటుంది. ఎప్పటిలాగే ఆ రోజూ గేమ్‌స్టార్ట్ చేసింది. అవతలి వైపు నుంచి ఓ అపరిచితుడు అమ్మాయికి గేమ్ పార్ట్‌నర్‌గా చేరాడు. గేమ్ ఆడుతూ నితారాతో సంభాషణ మొదలు పెట్టాడు. 'చాలా స్మార్ట్‌గా ఆడుతున్నావ్.. వెరీ గుడ్' అంటూ ప్రశంసించాడు. 'థాంక్స్' చెప్పింది నితారా. ఇంకో రెండుమూడు క్యాజువల్ మాటల తర్వాత 'నువ్వు అమ్మాయివా? అబ్బాయివా?' అంటూ అడ్వాన్స్ అయ్యాడు. 'అమ్మాయిని' అంటూ బదులిచ్చింది నితారా. 'ఒకసారి నీ ఫొటోగ్రాఫ్స్ పంపవా?' అని అడిగాడు. ఏదో అపశ్రుతి పసిగట్టిన ఆ అమ్మాయి వెంటనే డివైజ్ షట్‌డౌన్ చేసి, విషయాన్ని తల్లికి చెప్పింది. 'నా కూతురు చేసిన తెలివైన పని అదే. డివైజ్ క్లోజ్ చేసి ఆ ఆన్‌లైన్ అబ్యూజ్‌ను తల్లితో షేర్ చేసుకోవడం' అంటాడు అక్షయ్ కుమార్. సైబర్ అవేర్‌నెస్ మంత్ క్యాంపెయిన్‌లో మాట్లాడుతూ తన కూతురు ఎదుర్కొన్న పరిస్థితిని వివరించాడు అక్షయ్ కుమార్.


సుహానా ఖాన్, షారూఖ్ ఖాన్, గౌరీఖాన్


అజయ్ దేవ్‌గన్, నైసా, కాజోల్


అభిషేక్, ఐశ్వర్య, ఆరాధ్య


అనుష్క, విరాట్, వమిక

పాఠ్యాంశంగా..

అక్షయ్, ట్వింకిల్ ఖన్నా ఇద్దరూ క్రమశిక్షణకు మారుపేరు. పిల్లలిద్దరినీ మీడియాకు దూరంగానే ఉంచుతారు. వాళ్ల ప్రైవసీకే ప్రాధాన్యం ఇస్తారు. అయినా నితారా ఆన్‌లైన్ అబ్యూజ్‌ను ఎదుర్కొంది. అంత కంటికి రెప్పలా కాచుకుంటేనే ఇలాంటి సిచ్యుయేషన్ వస్తే.. తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగాలు చేసే ఇళ్లల్లో పిల్లల సంగతి ఎలా ఉంటుందో! 24 గంటలు కాదు కదా.. కనీసం ఇంట్లో ఉన్నప్పుడు కూడా పర్యవేక్షించలేనంత బిజీగా ఉంటున్నారు పేరెంట్స్. అందుకే స్కూళ్లల్లో సైబర్ సేఫ్టీని పాఠ్యాంశంగా చేర్చాలంటున్నాడు అక్షయ్ కుమార్.

ఎందుకంటే పిల్లల స్క్రీన్ టైమ్ మీద నియంత్రణ లేకపోతే సైబర్ ట్రోలింగ్, బుల్లీయింగ్, అబ్యూజ్‌కి గురయ్యే ప్రమాదం ఎలాగూ ఉంటుంది. దానితో పాటు అది పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యం పై, వాళ్ల సోషల్ బిహేవియర్ మీదా దుష్ప్రభావం చూపిస్తుందని పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. కాబట్టి అక్షయ్ కుమార్ చెప్పినట్టు పిల్లలకు బడిలో పుస్తక పాఠాలతో పాటు సైబర్ బిహేవియర్ జాగ్రత్తలనూ నేర్పించాలని చైల్డ్ సైకాలజిస్టులూ సూచిస్తున్నారు. అంతేకాదు పెద్దలకూ

కనీస అవసరాల నుంచి ఫ్లయిట్ టికెట్స్ దాకా, బడి పాఠాల నుంచి ప్రొఫెషనల్ మీటింగ్స్ దాకా అన్నిటికీ ఆన్‌లైనే మాధ్యమం. అలాంటి ఈ డిజిటల్ యుగంలో పిల్లల జోక్యాన్ని నివారించడం అసాధ్యమే. కానీ దాని మంచి చెడు, వ్యక్తిగత డేటాను ఎలా కాపాడుకోవాలి, ఆన్‌లైన్ భద్రత కోసం ఏం చేయాలి.. వంటి అంశాల మీద అవగాహన కల్పించడం మాత్రం సాధ్యమే! అత్యవసరం కూడా!

ఆన్‌లైన్ అవేర్‌నెస్ మీద వర్క్‌షాప్స్‌ను నిర్వహించాలని.. సైబర్ క్రైమ్ పోలీసులే దీని మీద చొరవ చూపాలని కోరుతున్నారు.

వీళ్లు కూడా..

షారూఖ్ ఖాన్ కూతురు సుహానా ఖాన్ నుంచి కాజోల్, అజయ్ దేవ్‌గన్‌ల కూతురు నైసా దేవ్‌గన్, ఐశ్వర్య రాయ్, అభిషేక్ బచ్చన్‌ల కూతురు ఆరాధ్యా బచ్చన్, అనుష్కా శర్మ, విరాట్ కోహ్లీల కూతురు పసికూన వమికా దాకా అందరూ ఆన్‌లైన్ ట్రోలింగ్, బుల్లీయింగ్‌కి గురైనవారే. సుహానా ఖాన్ ఒంటి రంగు, యాక్టింగ్ స్కిల్స్‌ను వెక్కిరిస్తూ ట్రోల్ చేశారు. నైసా దేవ్‌గన్ కూడా ఒంటిరంగు పట్ల ఆన్‌లైన్ హేళనకు గురైంది. ఆరాధ్యనయితే బాడీషేమింగ్ చేశారు. కెమెరా ముందు నిలబడటం రాదని ఎద్దేవా చేశారు. దీన్ని సీరియస్‌గా తీసుకుని ఐశ్వర్య సైబర్ పోలీసులకు ఫిర్యాదూ చేశారు. ఆ మాటలు, వెక్కిరింతలు ఆరాధ్య మనసును గాయపరచి ఆమె మానసిక ఆరోగ్యాన్ని ఎఫెక్ట్ చేస్తాయని.. ఐశ్వర్య కూతురిని డిజిటల్ మాధ్యమానికి దూరంగా ఉంచారు. కనీసం ఫోన్ కూడా వాడదు ఆరాధ్య. ఈ విషయాన్ని ఒక సందర్భంలో స్వయంగా అభిషేక్ బచ్చనే ప్రస్తావించారు. భార్యకు బెస్ట్ మదర్‌గా కితాబూ ఇచ్చారు. నటులు దియా మిర్జా, సమీరా రెడ్డి కూడా పేరెంట్స్‌గా.. పిల్లల స్క్రీన్ టైమ్ మీద నియంత్రణ ఉండాలని, దాన్నెలా ఫాలో కావాలో, పేరెంటింగ్‌లో ఎలా భాగం చేయాలో పేరెంట్స్‌కి నిపుణులు వర్క్‌షాపులు నిర్వహించి అవగాహన పెంపొందించాలని కోరుతున్నారు.





ఫ్యాషన్

• ఇయర్ చెయిన్స్

మెరిసే సరాలు





రమణుల ఆభరణాల అలంకరణలో చెవుల నుంచి హెయిర్ వరకు లేయర్లుగా చెయిన్ ఉండటం ఫ్యాషన్ మాత్రమే కాదు మన సంస్కృతి, సౌందర్యం, ఆచారం కూడా. దక్షిణ భారతదేశంలో చెంపసరాలు, మాటీలుగా పేరున్న ఈ ఇయర్ చెయిన్స్ బాలీవుడ్ నుంచి టాలీవుడ్ సెలబ్రిటీల వరకు ఇప్పుడు స్పెషల్ అట్రాక్షన్‌గా మారాయి. ఇటీవల దుర్గా నవరాత్రుల్లో సెలబ్రిటీలు ధరించిన మాటీల అందం నవతరపు చూపులను ఇట్టే కట్టిపడేసింది. ప్రాచీన ఆభరణంగా, అలంకరణలో సంపూర్ణతకు చిహ్నంగా నిలిచే మాటీలు వివాహ వేడుకలలో వధువు సింగారంలో తప్పనిసరై వెలుగొందుతోంది. పండగల రోజులలో ధరించిన డ్రెస్సుల తగిన ట్రెండీ మోడల్స్ కూడా ఇప్పుడు మార్కెట్లో అందుబాటులోకి వచ్చాయి. బంగారం, డైమండ్స్‌లోనే కాదు వివిధ రకాల పూసలు, సిల్వర్, ఆక్సిడైజ్‌లలోనూ ఈ మాటీల అందం మనసు దోచేస్తుంది.






సాంప్రదాయ ఆభరణాలకు మోడర్న్ మెరుపులు జోడించడమే ఈ ఇయర్ చెయిన్స్. ఒకప్పుడు దేవతల విగ్రహాల్లో, అమ్మమ్మల చెవులకు కనిపించిన చెంప సరాలు ఇప్పుడు రన్ వే వేదికలపై అడుగులు వేసే మోడల్స్ చెవుల్లో, మ్యాజిక్ ఫెస్టివల్ లుక్స్‌లో, బ్రైడల్ ఫొటోషూట్లలో కొత్త శైలిలో మెరిసిపోతున్నాయి. దక్షిణ భారతీయ సంప్రదాయాల్లో చెంప సరాలు (ఇయర్ చెయిన్)ఒక ముఖ్యమైన అలంకారం. నాటి కాలంలో మహిళల గౌరవం, ఆభరణ సంపూర్ణతకు చిహ్నంగా వెలుగొందిన చెంప సరాలు రాబోయే వేడుకలలో మరిన్ని ఆకర్షణలను జోడించనున్నాయి.

■ అద్దుకున్న ఆధునికత

ఈ రోజుల్లో ఆ చెంప సరాలు కొత్త రూపాల్లో కనిపిస్తున్నాయి. సిల్వర్, ఆక్సిడైజ్డ్, మెరూన్ కలర్ పూసలు, ముత్యాల చెయిన్లు, ఫ్యూషన్ ఫ్యాషన్‌లో కూడా ఇయర్ చెయిన్స్ స్పెషల్ లుక్ ఇస్తున్నాయి. సాదా సీదా కుర్తా మీదకైనా, లెహంగా లేదా చీర ధరించినా ఆభరణాల అలంకరణలో ఇయర్ చెయిన్ అందం జత చేరితే ఆ అందం ఇనుమడిస్తుంది.

■ శక్తి సరాలు..

ఇది కేవలం అలంకారం కాదు. చెవులు–జుట్టు ప్రదేశంలో ఈ సరాలు కదలడం మన ప్రాణశక్తిని సమతుల్యం చేస్తుందని చెబుతారు. అందుకే కొంతమంది దీనిని 'శక్తి సరాలు'గా భావిస్తారు.

■ సెలబ్రిటీల స్టైల్ టచ్


బాహుబలి సినిమాలో అనుష్క ధరించిన చెవి జూకాలు, చెంప సరాలు ఎంతో మందిని ఆకట్టుకున్నాయి. అలాగే, ఇటీవల దుర్గా నవరాత్రుల్లో బాలీవుడ్ నుంచి టాలీవుడ్ వరకు సెలబ్రిటీలైన అలియా భట్, జాన్వీకపూర్, సోనమ్‌కపూర్, శోభిత ధూళిపాల, నయనతార... లాంటి నటీమణులు తమ ట్రెడిషనల్ ఫొటోషూట్లలో ఇయర్ చెయిన్స్ ధరించి ట్రెండ్ సెట్ చేశారు. ఆ లుక్స్ వల్లే ఈ పాత ఆభరణం మళ్లీ యంగ్ జనరేషన్‌లో పాపులర్ అయింది. పాత ఆభరణానికి కొత్త రూపం దక్కింది. ఇప్పుడు వాటి డిజైన్, మెటీరియల్, వాడుక అన్నీ ఫ్యాషన్ ప్రపంచంలో కొత్త భాషను పరిచయం చేస్తున్నాయి.

ఇప్పుడు కొంతమంది కళాకారులు రీసైకిల్ మెటల్, హ్యాండ్ మేడ్ ఫ్యాబ్రిక్ థ్రెడ్స్‌తోనూ వీటిని రూపొందిస్తున్నారు. అమ్మమ్మల నాటి సంప్రదాయ నెమలి, మామిడిపిందెల నుంచి ప్రారంభమైన చెంప సరాల డిజైన్లు ఈ రోజుల్లో ఇయర్ కఫ్స్ వరకు వినూత్నంగా కళ్లకు కడుతున్నాయి.

కేర్‌గివర్

రాణి అనే నేను

ఇజ్రాయెల్ నుంచి మాట్లాడుతున్నాను...



ఇజ్రాయెల్ అనే మాట వినిపించగానే యుద్ధబీభత్సాలు, దాడులు గుర్తుకు వస్తాయి. కొద్దిమంది నెటిజనులకు మాత్రం ఇజ్రాయెల్ అనగానే టక్కున గుర్తుకు వచ్చే పేరు రాణి గోర్సెర. 'ఇజ్రాయెల్‌లో కేర్‌గివర్‌గా పనిచేస్తున్నాను' అని చెప్పే రాణి సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటుంది.

ఎప్పటికప్పుడూ ఆసక్తికరమైన వీడియోలు ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తుంటుంది.

'కేర్‌గివర్'గా వృద్ధులను కన్నబిడ్డలా చూసుకుంటుంది. ఇళ్లు శుభ్రం చేయడం, వంట చేయడం, వృద్ధులతో కబుర్లు చెప్పడం... ఇలా ఎన్నో చేస్తూ ఉంటుంది.

'కేర్‌గివర్‌గా నా జీవితంలో ఒకరోజు' కాప్షన్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో చేసిన వీడియోలో కబుర్లు చెబుతూ, నవ్విస్తూ, ఒక వృద్ధురాలి కాళ్లని శుభ్రం చేయడం, నెయిల్ పెయింట్ వేయడం.. .మొదలైన దృశ్యాలు కనిపిస్తాయి.

నవరాత్రి ఉత్సవాలలో ఉత్సాహంగా నృత్యం చేయడం మరో వీడియోలో కనిపిస్తుంది.

'చాలామంది వృద్ధులు ఒంటరితనం అనే దీవిలో దిగులుగా జీవిస్తున్నారు. అలాంటి వారికి రాణిలాంటి వారు సరికొత్త జీవనోత్సాహాన్ని ఇస్తున్నారు. వృత్తిపరంగా ఆమె కేర్‌గివర్ కావచ్చు గానీ వృద్ధులకు ఆమె ఆత్మీయతను పంచే కన్నకూతురు' అని ఒక నెటిజన్ కామెంట్ రాశారు.

జర్నీ

భారత్ పిలిచింది!



బ్రెయిన్ ట్యూమర్ బారిన పడిన యూకే అథ్లెట్ జాక్ ఫెంట్‌కు ప్రతికూల ఆలోచనలు వస్తుండేవి. ఆ సమయంలోనే తనకు ఇష్టమైన ఇండియా గుర్తుకు వచ్చింది. వెంటనే రంగంలో దిగాడు.

'ఇండియా–80 రోజులు–4,000 కిలోమీటర్‌లు' కార్యక్రమానికి శ్రీకారం చుట్టాడు.


ఇండియాలోకి అడుగు పెట్టిన క్షణం నుంచి అతడిలో ఉత్సాహం మొదలైంది. ఇండియాలో తన '80-డే రన్' తాలూకు వీడియోలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నాడు. 'ప్రొటెక్టర్' కాప్షన్‌తో పోస్ట్ చేసిన వీడియోలో తనను ప్రమాదం నుంచి రక్షించిన వీధి శునకం గురించి చెప్పాడు.

ఆ శునకంతో తనతోపాటు పదమూడు కిలోమీటర్‌లు నడిచింది. దానికి 'మనాలి' అని పేరు పెట్టాడు జాక్.

'80 రోజులలో రోజుకు 50 కిలోమీటర్‌ల దూరం పరుగెత్తడానికి ఇండియాకు ప్రయాణమవుతున్నాను. మంచుతో కప్పబడిన కొండల నుంచి కేరళ ప్రకృతి అందాల వరకు ఎన్నో చూడబోతున్నాను. బ్రెయిన్ ట్యూమర్ అని నాకు నిర్ధారణ అయిన తరువాత నా మనసు భయం, గందరగోళం, దుఃఖంతో నిండిపోయింది. నాకే కాదు భూమి మీద ప్రతి ఒక్కరికీ కష్టాలు కూడా ఉంటాయి. దీంతో పాటు ఒక ఆప్షన్ కూడా ఉంటుంది. ఇండియాకు వెళ్లాలనుకోవడం అనేది నా ఎంపిక. మళ్లీ పూర్వంలా ఉత్సాహంగా ఉండాలనుకుంటున్నాను'' అని తన యాత్ర ప్రారంభానికి ముందు షేర్ చేసిన పోస్ట్‌లో రాశాడు జాక్ పెయింట్.

మనసు మాట విందాం!

నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం



మన సమాజంలో దగ్గు, జలుబు, జ్వరం, షుగర్, బీపీ అంటే వెంటనే డాక్టర్ దగ్గరకు వెళ్తారు. కానీ డిప్రెషన్, ఆందోళన, పానిక్ అటాక్, డీ-పర్సనలైజేషన్ లాంటి వాటిని బలహీనతలు లేదా అలసత్వంగా చూస్తారు. అవేవో బాధితులు కావాలని తెచ్చిపెట్టుకున్నట్టు భావిస్తారు. కానీ నిజానికి మానసిక ఆరోగ్యం కూడా శారీరక ఆరోగ్యంతో సమానమే. ఇవి రెండూ పరస్పర ఆధారితాలు.

తలనొప్పి, తల తిరుగుడు, వాంతులు, జీర్ణ సంబంధ ఇబ్బందులు, గుండె అత్యంత వేగంగా కొట్టుకోవడం, ముఖ కండరాలు అదరడం, చర్మం పాలిపోవడం లాంటి శారీరక లక్షణాల ద్వారా మానసిక వ్యాధులు వ్యక్తం అవుతాయి. అంటే, మనసు తాను అనుభవించే హింసను గుర్తించమని, త్వరగా ఈ బాధను తగ్గించే ఉపాయం చూడమని శరీరం ద్వారా వేడుకుంటుంది! కానీ పట్టించుకోం మనం. ఎందుకంటే, బాధితులు ఆ వ్యాధులకు సంబంధించిన మందులు తీసుకుంటే వాటికి బానిసలవుతారని, ఈ వ్యాధులు పూర్తిగా నయం కావనీ. నిజానికి ఇవన్నీ తప్పుడు భావనలు.

మానసిక వ్యాధులు కూడా శారీరక వ్యాధుల్లానే అనేక కారణాల వల్ల రావచ్చు. మెదడు రసాయనాల అసమతుల్యత, వంశపారంపర్యం, ఒత్తిడి, పరిసరాలు వంటి అంశాలు దీనికి కారణం అవుతాయి. కనుగొనదగిన కారణాలు ఏమీ లేకుండా కూడా మానసిక వ్యాధులు రావచ్చు. తొలిదశలోనే వ్యాధిని గుర్తించి సరైన చికిత్స చేస్తే, బాధితులు సాధారణ జీవితం గడపవచ్చు.

పిల్లలు, యువకులు, పెద్దలు ఎవరికి అయినా మానసిక సమస్యలు రావచ్చు. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం, 2021లో ప్రపంచంలో సుమారు 1.1 బిలియన్ మంది మానసిక వ్యాధుల బారినపడ్డారు (ప్రతి ఎనిమిది మందిలో ఒకరు) అసలు మీరు పని చేసేచోట, సంచరించే చోట మీకు తెలియకుండా ఇప్పటికే ఒకరిద్దరు డిప్రెషన్‌తోనో, ఏంగ్జయిటీతోనో వుండి ఉండొచ్చు. రోజువారీ జీవితంలో అవరోధం కలగనంతవరకూ పరవాలేదు. సమస్య వస్తే మాత్రం, దాచుకోవడం కంటే కుటుంబ సభ్యుల, స్నేహితుల, సహకారం తీసుకోవడం, వైద్యుని సంప్రదించడం ఎంతో అవసరం.

అన్నిటికన్నా ముఖ్యమైన సంగతి, మానసిక ఆరోగ్య సమస్యలు ''నిజమైనవి'' అనే విషయాన్ని గ్రహించడం, అంగీకరించడం. జ్వరం వస్తే విశ్రాంతి తీసుకుంటాం కదా! అలాగే, మనసు అలసిపోయినప్పుడు, అది బాధపడినప్పుడు కూడా సహాయం కోరడం సిగ్గుపడాల్సిన విషయం కాదు. ధైర్యం, అవగాహన అవసరమయ్యే విషయం. మనసుని ఖాళీగా ఉంచకుండా మంచి వ్యాపకాలు పెట్టుకోవాలి. గ్రౌండింగ్ టెక్నిక్స్, బ్రీతింగ్ వ్యాయామాలు నేర్చుకోవాలి..

సర్వమానవ సహోదరత్వం, సౌభ్రాతృత్వం గురించి ఉపన్యాసాలు దంచేస్తాం. మనలో అది నిజంగా వుందని నిరూపించుకునే చిన్న అవకాశం ఒకటి ఏమిటంటే, మానసిక వ్యాధులతో బాధపడేవారిని చూసి ఎగతాళిగా నవ్వకుండా, తప్పుగా మాట్లాడకుండా ఉండటం, వాళ్లకి చేతనైన సహాయం చెయ్యడం.

ఆమాత్రం చేయలేమా?

ప్రపంచ ప్రసిద్ధ వ్యక్తుల్లో అబ్రహాం లింకన్, ఐజాక్ న్యూటన్, విన్సెంట్ వ్యాన్గో, చార్లెస్ డికెన్స్ నుంచీ మన దీపికా పదుకొనే వరకూ ఎందరో గొప్ప వ్యక్తులు, సెలబ్రిటీలు మానసిక వ్యాధులతో పోరాడి, సాధారణ స్థాయిని మించి ఉన్నతంగా బతకడమే కాకుండా, తమ ప్రతిభతో లోకానికి ప్రేరణగా నిలిచారు. మానసిక రోగులు చాలా వరకు ప్రమాదకారులు కాదు; మందులు వైద్యుని సూచన మేరకు తీసుకుంటే అడిక్షన్ రాదు.


వైష్ణవి గద్దె, వైద్య విద్యార్థిని

బులియన్
(బంగారం 10 గ్రా.; వెండి కిలో)
అక్టోబర్ 10న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,29,410	1,26,250	1,24,150	1,26,250.	1,28,000	1,24,370
బంగారం (22 క్యారెట్లు)	1,17,340	1,13,380	1,13,800	1,17,210	1,17,700	1,14,000
వెండి	1,70,000	1,58,600	1,67,000	1,58,600	1,60,000	1,71,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.